

మన్యంలో విస్తారంగా వర్షాలు

- 21.61 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి -పాడేరు: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మన్యంలో కుండపోత వర్షం కురిసింది. జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పగటిపూట తెరిపినివ్వకుండా కురిసిన వర్షంతో 21.61 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాల్లో భారీ వర్షాలు మరికొన్ని మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. దాదాపు సగంపైగా మండలాల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంది. రంపచోడవరం డివిజన్లోని ఎటపాక, కూనవరం, గంగవరం రాజవొమ్మంగి, మండలాల్లోనూ పాడేరు డివిజన్లోని అనంతగిరి, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు, జి మాడుగుల మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదయింది. జిల్లాలో అనంతగిరి మండలంలో అత్యధికంగా 52.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా మొత్తం 475.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. పగలంతా తెలిపివ్వని వర్షం, సాయంత్రానికి మన్యంలో మరింత జోరు అందుకుంది.

మన్యాన్ని ముంచెత్తిన 'మిచౌంగ్'



సీలేరులో కళ్లాలోని ధాన్యం రాశులు, కుప్పలు కింద‌కు చేరిన వర్షపు నీరు



జి.మాడుగులలో వర్షపు నీటిలో మునిగిన వరి పనలు

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా వీడకుండా కురుస్తున్న వర్షాలతో మన్యంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చేతికి అందొచ్చే దశలో ఖరీఫ్ వరితోపాటు ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పాలాల్లోని కోసిన వరిచేను పనలు నీటమునిగిపోగా, కళ్లాలకు చేరిన చేను కుప్పలు, ధాన్యం కూడా తడిసిపోయి తీవ్రనష్టమే జరిగింది. వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహించడంతో జనజీవనం దాదాపు స్తంభించిపోయింది.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

హుకుంపేట: తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మండలంలో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. కోసిన వరిచేను పొలాల్లో తడిసిపోగా, కళ్లాల్లో ఆదరాబాదరాగా వేసిన చేను కుప్పల కిందకు వర్షపునీరు చేరింది. తడిసిన చేను, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చి, టార్పాలిన్లు కప్పి భద్రపరిచే చర్యలు చేపట్టినప్పటికీ రైతు పంట సంరక్షణ చేయలేని పరిస్థితి ఉంది. దీంతో వరిచేను, ధాన్యం పాడవ్వడంతోపాటు నాణ్యత చెడి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జి. మాడుగుల : తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో పలువురి రైతుల వరిచేను తడిసి ముద్దయింది, పొలాల్లో కోసిన వరిచేను పనలను కుప్పలుగా వేసేందుకు వీలులేని పరిస్థితిలో అలాగే ఉండిపోవడంతో అవన్నీ నీట మునిగాయి. బొయితిలి పంచాయతీ మండిబా గ్రామంలో రాజ్మా చిక్కులు పూర్తిగా దెబ్బతిన్నాయి .పంట చేతికొచ్చే సమయానికి తుఫాన్ తాటికి పూర్తిగా నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు. రహదారులపై వర్షపు నీరు ఉధృతంగాప్రవహించింది. వి.కోడపల్లి రహదారిపై చెట్లు నేలకొరిగాయి స్థానికుల సహాయంతో . పోలీసులు వాటిని తొలగించారు. వాగులు వంకలు పొంగిపొర్లడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల్లో దిగి దాటి వెళ్లే సాహసం చేయవద్దని సిఐ ఎన్.రమేష్ గిరిజనులకు సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు

పంటలకు తీవ్ర నష్టం .. గిరి రైతుల ఆవేదన

ఉప్పొంగిన వాగులు... జనజీవనం అస్తవ్యస్తం

పెదబయలు: తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో పంటపొలాల్లోని వరి పనలు కొట్టుకు పోయాయి. సీతగుంట పంచాయతీ కేంద్రంతో పాటు మండలంలో 23 పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది పంటపొలాల్లో నీరుచేరడంతో చేను తడిసిపోయింది.ధాన్యం నేలపాలైందనిరైతులు ఆందోళన చెందుతున్నారు

రాజవొమ్మంగి : మిచౌంగ్ తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా రాజవొమ్మంగి మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఈ ఏడాది రైతులు సుమారు 4800 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. రైతులు అప్పులు చేసి ఎకరా వరి పంటకు దుక్కు, కూలీలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రూపేనా సుమారు రూ25వేలు పైబడి పెట్టుబడి పెట్టారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన 300 ఎకరాలకు పైబడి పంట ఎండిపోయింది. అష్టకష్టాలకోర్చి పండించిన మిగిలిన పంట ఇప్పుడు అకాల తుఫాను వలన నష్టపోవాల్సి వస్తోంది. వర్షాలకు కోసిన వరిపనలు నీట మునిగాయి. మండలంలోని 200 ఎకరాలకు పైబడి కోసిన వరి పంట వర్షానికి మునిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మండలంలో పలువురు రైతులు కోరుతున్నారు.

విఆర్.పురం : తుఫాన్ ప్రభావంతో వర్షం కురవడంతో వరి, మినుము, పత్తి, మిర్చి, పెసర తదితర పంటలకు నష్టం వాటిల్లింది. కోసిన వరి పంట నీట మునిగింది. దానిని కాపాడుకొనేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

కొయ్యూరు : మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు గిరిజన రైతు కుదేలవు తున్నారు. మంగళ వారం మండలం లోని ముకుడుపల్లి, నల్లబిల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కారణంగా కాఫీ పండ్లు సేకరించి, కళ్లాల్లో ఆరబెట్టగా తడిసిపోయాయి. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, గాలికొండ, గుమ్మరేవులు పంచాయితీల పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతన్నలు తీవ్ర ఆందోళన గురవుతున్నారు. వర్షా భావం వల్ల పంటలు ఎండిపోగా, కొద్దిపాటి వరి, రాగులు, సామలు తదితర పంటలు చేతికి వస్తాయని ఆశించిన సమయంలో అకాల వర్షాలకు పూర్తిగా తడిసి నాశనం కావడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

జీకే వీధి మండలం మంగళపాలెం గ్రామానికి చెందిన గడుతూరి కాసులమ్మ పండిన వరి చేను కల్లంలోకి తీసుకొచ్చింది. ఇంతలోనే అకాల వర్షాలతో ధాన్యం పూర్తిగా తడిసి పోయాయి. చేతికొచ్చిన పంట మట్టి పాలైందని కాసులమ్మ కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. వర్షపు నీరుని తొలగించేందుకు కాసులమ్మ భర్త శత విధాల ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు.

కూలిన ఇళ్లు

జి. మాడుగుల : తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జి.పంచాయతీ పంచాయతీ చుట్టుమట్ట గ్రామంలో కిలోలమహేష్ అను గిరిజనుడి ఇల్లు కుప్పకూలింది, ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తుపాన్‌పై అధికారుల అప్రమత్తత : పిఒ

ప్రజాశక్తి -పాడేరు: మిచౌంగ్ తుఫాను ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడా, ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తుపాను తీరం దాటి, బలహీన పడుతున్న సమయంలో అధికంగా వర్షం కురిసే అవకాశం ఉన్నందున వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ఏజెన్సీలో ఎవరూ గెడ్డలు దాటి ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా అనంతగిరి, పాడేరు, చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో ఘాట్ రోడ్ల ప్రయాణాలు నియంత్రించాలని సూచించారు. అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గ్రామస్థాయిలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రానున్న 24 గంటల్లో భారీగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తగు జాగ్రత్తలతో బయటకు రావాలేగానీ, వీలైనంత వరకు గ్రామాల్లోనే ఉండాలన్నారు. వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఏజెన్సీలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం, పశు సంపదకు ముప్పు వాటిల్లకుండా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. రహదారులకు అడ్డంగా చెట్లు నేలకొరిగితే వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ వైర్లు తెగిపోతే సకాలంలో విద్యుత్తు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు.

కెకె లైన్‌లో విరిగిపడ్డ కొండ చరియలు

- పట్టాలు తప్పిన రన్నింగ్ గూడ్స్ రైలు



రన్నింగ్‌లోనే పట్టాలు తప్పిన గూడ్స్ రైలు ఇంజిన్

అనంతగిరి : మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో కెకె.లైన్‌లో కొండచరియలు విరిగిపడి, బండరాళ్లు రన్నింగ్‌లో ఉన్న గూడ్స్ రైలుపై పడ్డాయి. కొత్తవలస, కిరండోల్ లైన్‌లో శివలింగాపురం స్టేషన్, యార్డ్ 1 సమీపంలో మంగళవారం నాలుగు గంటల సమయంలో ఐరన్‌ఓర్‌తో రన్నింగ్‌లో ఉన్న గూడ్స్ రైలుపై కొండ చరియలు పడడంతో ఒక భోగీ పట్టాలు తప్పింది. గమనించిన సిబ్బంది గూడ్స్ ట్రైన్ పైలెట్‌ను అప్రమత్తం చేసి నిలుపుదల చేయడంతో పెద్దప్రమాదమే తప్పింది. దీంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కుండపోత వాన ఏకధాటిగా కుడుస్తున్నడంతో ట్రైన్ ట్రాక్ పక్కనే ఉన్న ఎత్తైన కొండ శిఖరాలు తడిసి ముద్దై, ఈ ప్రమాదం జరిగింది. కెకెలైన్‌లో శివలింగపురం, త్రైడా, చిమ్మిడిపల్లి, బొర్రా, కరకవలస, సిమ్మిలిగూడ వంటి ప్రాంతాలలో వర్షాలు కురిసిన ప్రతిసారి ఇలాంటి ప్రమాదాలు షరామామూలుగా మారిపోయాయి.దీనిపై కొత్తవలస విశాఖ రైల్వే శాఖ సిబ్బందికు సమాచారం అందించడంతో ట్రైన్ల రాకపోకలను నిలిపేశారు. తెరిపిలేకుండాం వర్షం కురస్తుండడంతో సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులకు ఆస్కారం లేకండా పోయింది.

సంపంగిగెడ్డలో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

డుంబ్రిగుడ: తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్గాలతో ఏజెన్సీలోని కొండవాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. డుంబ్రిగుడ, హుకుంపేట, అరకులోయ మండలాలను అనుకుని ఉన్న ప్రధాన రహదారిలోని కించుమండ వద్ద సంపంగిగెడ్డ ఉధృతికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. చాపరాయి, గోరాపూర్, కురిడి గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జాతీయ రహదారి చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. వరిపంట కోతలు నిలిచిపోయాయి. కళ్లాలోని ధాన్యం, వరిచేనును టార్పలిన్లు కప్పి రక్షించే చర్యలు చేపడుతున్నారు.



సంపంగిగెడ్డ ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



పంట రక్షణకు రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు

పంట రక్షణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు దెబ్బతినే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట రక్షణపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారి రమేష్ నాయుడు మండలంలోని పలు పంట పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే కోసిన వరి చేను కుప్పలు వేసుకొని వాటిపై తార్పాలిన్లు కప్పుకోవాలన్నారు. కోసిన వరి పనలు నీట మునిగిన మడుల్లో నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ వరి పనలు నీట మునిగి మొక్క వచ్చినట్లయితే 5శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యం తేమశాతం ఎలా ఉన్నా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వ సూచన మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె ప్రదీప్ కుమార్, పి రామరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వాలంటీరు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మండలంలోని సున్నంపాడు పంచాయతీ తుర్రురు గ్రామ వాలంటీర్ పల్లాల సోమిరెడ్డి కుటుంబానికి వైసిపి మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, రూ.12,500 నగదు అందజేశారు. ఈ సందర్భంగా సత్తి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వాలంటీర్ సోమిరెడ్డి కుటుంబానికి అన్ని విధాల పార్టీ అండగా ఉంటుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం, అదేవిధంగా, శాశ్వత గృహ నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి ఉపసర్పంచ్ బొడ్డేటి వీరబాబు, మండల కార్యదర్శి గంగరాజు, ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్, డ్రగ్ మెంబర్ రామారావు, సున్నంపాడు సచివాలయ కన్వీనర్ పల్లాల కృష్ణారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ధర్మేంద్ర, వాలంటీర్ సురేంద్ర పాల్గొన్నారు.



నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

తుపానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-చింతూరు

మిచౌంగ్ తుపాను కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు సర్వేలు నిర్వహించి, బాధిత రైతులందరికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి వరి, నువ్వు, పత్తి పంటలను వేశారని, పంటలు కోతకొచ్చిన సమయంలో వరి పైరు తుఫాను కారణంగా సర్వనాశనమైందని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు సకాలంలో వర్షాలు పడక పంటలు దిగుబడి తగ్గిపోగా, ఇప్పుడు అకాల వర్షాలకు పంటలు పాడైపోయాయని పేర్కొన్నారు. చింతూరు మండలంలో 4114 హెక్టార్ల వరి, 440 హెక్టార్ల పత్తి పంట సాగు చేయగా, తుఫాను కారణంగా ఆ పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని వాపోయారు. తక్షణమే ఆయా పంటల నష్టంపై వ్యవసాయ శాఖ సర్వేలు నిర్వహించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, కూనవరం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం, చిత్రంలో జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు

నష్ట పరిహారం చెల్లించాలి

విఆర్.పురం : ఏజెన్సీలో తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సొసైటీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. వరి, మినుము, పత్తి, మిర్చి, పెసర తదితర పంటలకు నష్టం వాటిల్లిందని, అధికారులు సర్వే చేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చిన్న, సన్నకారు, రైతులను ఏకం చేసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మంచి ధర పలికే వరకూ పార్చుమెంట్ కాఫీ భద్రం

ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- చింతపల్లి : మంచి గిట్టుబాటు ధర వచ్చేవరకు పార్చుమెంట్ కాఫీని జాగ్రత్తగా భద్రపరచుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు. గొడౌన్‌లో భద్రపరిచిన తడి పార్చుమెంట్, పొడి పార్చుమెంట్ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎకో పల్పింగ్ యూనిట్‌కు కాఫీ పళ్లను సరఫరా చేసిన రైతుల చెల్లింపులపై ఆరా తీసారు. త్వరితగతిన చెల్లింపులు చేయాలని ఆదేశించారు. పార్చుమెంట్ కాఫీని భద్రపరిచేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, గొడౌన్‌లో స్థలం చాలకపోతే ఆప్కాబ్ గొడౌన్లలో భద్రపరచాలని సూచించారు. వర్షం తగ్గిన తరువాత తడి పార్చుమెంట్ కాఫీని ఆరబెట్టాలని, డ్రయర్‌కు జనరేటర్ సమకూర్చి రొటేటర్ డ్రయర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి తడి పార్చుమెంట్ కాఫీని ఆరబెట్టాలని సూచించారు. కాఫీ రైతులకు మంచి ధరను అందించాలని, రైతులు దళారులకు విక్రయిస్తే నష్టపోతారన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కాఫీ సహాయ సంచాలకులు ఎన్. అశోక్ మాట్లాడుతూ 562 టన్నుల కాఫీ పండ్లను రైతులు సరఫరా చేశారన్నారు. రూ.2.40 కోట్ల విలువైన కాఫీ పళ్లను రైతుల నుంచి సేకరించామని, ఇప్పటివరకు రూ.1.75కోట్లు రైతులకు చెల్లించామన్నారు. మిగిలి బకాయిలు త్వరలోనే చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిఇఇ చాణక్య, మాక్స్ అధ్యక్షులు సెగ్గె కొండలరావు, ఉపాధ్యక్షులు గాం సింహాచలం, డైరెక్టర్ మామిడి గోవిందరావు, అకౌంటెంట్ బివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.



కాఫీ పిక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



కొయ్యూరులో కుండపోతగా కురుస్తున్న వర్షం

ఎడతెరిపి లేని వర్షం

ప్రజాశక్తి - కొయ్యూరు

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో మంగళవారం మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారే వరకూ భారీగా ఈదురు గాలులు వీచాయి. మంగళవారం ఉదయం నుంచి వాతావరణం పూర్తిగా మారిపోయి ఉదయం 8 గంటల నుంచి భారీ వర్షం మొదలైంది. మండల కేంద్రంలోనే కాకుండా మండలంలోని పనసలపాడు, మాకవరం, నడింపాలెం, బూదరాళ్ల, చౌడుపల్లి తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. భారీ వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సీలేరు : జికె.వీధి మండలంలో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో సీలేరు, దారకొండ తదితరు పంచాయతీలో దినసరి కూలీలకు పనుల్లేక ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం దినసరి కూలీలకు కరువు సాయం అందించాలని కోరుతున్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ప్రజాశక్తి -కొయ్యూరు

వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు మేలు జరుగుతుందని ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. మండలంలోని వెలగలపాలెం పంచాయతీలో ఎంపిపితో పాటు వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, జెసిఎస్ కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు గాడి సత్యనారాయణ, సర్పంచ్ రత్నకుమారి, సత్యనారాయణ తదితరులు మంగళవారం ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు వైసిపి ప్రభుత్వంలో జరిగిన మంచిని తెలియజేశారు. గ్రామంలో ఎంతమందికి, ఎంతెంత అందించారో వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీకి సుమారు రూ.6 కోట్లు అందించినట్లు తెలిపారు. దీని వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపెడుతున్నట్లు చెప్పారు. అనంతరం వైసిపి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు పి జోగిరాజు, ఎస్ సరస్వతి, యు.రాంబాబు, ఎస్ సత్తిబాబు, నాయకులు బి.అప్పలనర్స, టి.వెంకటేష్, ఎం.కొండబాబు, భీమరాజు, ఎస్ గౌరీదేవి, రేణుక, పద్మ, జి.నూకరాజు, ఎస్ పద్మ, బి శివాజీ, కె రత్నకుమారి, ఎస్.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను చూపుతున్న వైసిపి నాయకులు, మహిళలు

గ్యాస్ డెలివరీపై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం గ్రామ శివారున ఉన్న గొడౌన్ వద్ద మాత్రమే వినియోగదారులకు వంట గ్యాస్ సిలిండర్లు డెలివరీ ఇస్తామని హెచ్పి గ్యాస్ డీలర్, సాయి చరిష్మా ఏజెన్సీ యజమాని రాజ్యలక్ష్మి తెలిపారు. గ్రామం మధ్యలో గ్యాస్ సరఫరా చేస్తున్నారన్న ఫిర్యాదులపై స్పందించారు. విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీకి సంబంధించిన కొత్త కనెక్షన్లు బదిలీలు ఫిర్యాదులు, ఆఫ్లైన్ బుకింగ్ కార్యకలాపాలకు మాత్రమే మండల కేంద్రం నవోదయ కాన్వెంట్ వద్ద ఉన్న తమ కార్యాలయానికి వినియోగదారులు రావాలని కోరారు. డోర్ డెలివరీకి సంబంధించిన సిబ్బంది నగదు లావాదేవీలకు ఖాళీ సిలెండర్లతో తమ కార్యాలయానికి వస్తుంటారని, ఇక్కడ గ్యాస్ డెలివరీ ఉండదన్నారు. శివారున ఉన్న గొడౌన్ వద్ద గ్యాస్ డెలివరీ వాహనాలకు రక్షణ లేనందున ఖాళీ సిలెండర్లుతో వాహనాలను గ్రామం మధ్యలో ఉన్న కార్యాలయం వద్ద నిలుపుదల చేస్తారని, వీటి వల్ల ప్రమాదమన్న ఆరోపణలు, ఆందోళనకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో పెనుగొల్లు ధర్మవరం బ్రిడ్జిపై దాణాలోడ్తో వెళుతున్న ఐషర్ వ్యాన్ తాడు ఊడిపోవడంతో ఫీడ్ మొత్తం నేలపాలై ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ పి ప్రసాదరావు వెంటనే తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. రోడ్డు పాలైన ఫీడ్ను తొలగిస్తేగానీ వాహన రాకపోకలు సజావుగా సాగే పరిస్థితి లేదని గమనించి, అక్కడే ఉన్న కొంతమంది యువకుల సహాయం తీసుకుని పక్కనే ఉన్న కోస్టల్ రొయ్యల ఫ్యాక్టరీ నుంచి వాటర్ ట్యాంకర్తో నీరు తీసుకొచ్చి, యువకులతో కలసి ఎస్ఐ ప్రసాదరావు స్వయంగా రోడ్డును శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. దీంతో వాహన రాకపోకలక వీలు కలిగింది. ఎస్ఐ చొరవను పలువురు ప్రశంసించారు.పోలీసులకు సహకరించిన తుంపాల రాంబాబు, గ్రామ యువకులు, పోలీసు సిబ్బందిని అభినందించారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకు ఇష్టం కార్య క్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి దమయంతి ఆధ్వర్యంలో పిల్లలకు మాస్ రీడింగ్ను నిర్వహించి, కథల పుస్తకాలు ఒక్కొక్కరి చేత చదివించారు. అనంతరం గ్రంథాలయాల వల్ల కలిగే ఉపయోగాలను పిల్లలకు వివరించారు. ప్రతివారం నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ క్లబ్ కార్యక్రమం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

13 అడుగుల కొండచిలువ హతం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాతకృష్ణదేవిపేట గ్రామస్థులు మంగళవారం ఉదయం 13 అడుగుల భారీ కొండ చిలువను హతమార్చారు. గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఏర్పాటు చేసిన వలకు కొండ చిలువ చిక్కింది. దీన్ని గమనించిన రైతులు దాన్ని కొట్టి చంపారు. పాత జోగుంపేటలో కూడా భారీ పాము కనిపించడంతో గ్రామస్థులు దాన్ని హతమార్చారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ముగ్గురు బాధితులకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రూ.2.47లక్షల చెక్కులను అందజేశారు. మాకవరపాలెం మండలం కొండల అగ్రహారానికి చెందిన అంజూరి భాగ్యలక్ష్మికు రూ.1..40లక్షలు, బిక్కవోలు ప్రసాద్కు రూ.35వేలు, లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన సామిరెడ్డి నాగవెంకటరమణ రూ.72వేలు సిఎం సహాయనిధి ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.కార్యక్రమంలో మాకవరపాలెం ఎంపిపి రుత్తల సత్యనారాయణ, మండల వైసిపి అధ్యక్షులు రుత్తల వాసు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు

ప్రజాశక్తి-గొలుగొండ : తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని జోగుంపేట పంచాయతీ ఎస్సీ కాలనీలో పెంకిటిల్లు పైకప్పు కూలిపోయింది. ఇంటి యాజమాని కేలింగి దేముడు అప్రమత్తంగా ఉండడం వల్ల పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సచివాలయ విఆర్ఓ గోవర్ధన్ ఇంటిని పరిశీలించి నష్టపరిహారం వివరాలను నమోదు చేసుకున్నారు. అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించి తనను ఆదుకోవాలని దేముడు కోరుతున్నారు.

రోలుగుంట : వర్షాలకు మండలంలోనిఅర్ల పంచాయతీ పిత్రిగడ్డ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనుడు మర్రి సన్యాసిరావు పూరింటి గోడ కూలిపోయింది. వీచిన గాలులకు ఇంటిపై ఉన్న గడ్డి ఎగిరిపోగా, వర్షానికి నాని మట్టి గోడలు కూలిపోయాయి. తక్షణమే గిరిజనుడిని ఆదుకోవాలని సిపిఎం నాయకులు కె.గోవిందరావు కోరారు.

ఎస్డిటిఐల అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లను అప్గ్రేడ్ చేసేందుకు రూ.100 కోట్లతో ప్రణాళికలు సిద్ధమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శిక్షణ డైరెక్టర్ బి.నవ్య తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆమె మీడియాతో మాట్లాడుతూ అధిక నాణ్యత, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని రూపొందించడంలో తమ ప్రయత్నం దోహదపడుతుందన్నారు. యువత స్వభావిక సామర్థ్యాన్ని అన్లాక్ చేయడంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ మూలస్తంభం వంటిదన్నారు.

39వ వార్డులో ఎమ్మెల్యే వాసుపల్లి ప్రజా దర్బార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నానని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం జివిఎంసి 39వ వార్డు లక్ష్మీటాకీస్ బస్ స్టాప్ దగ్గరలో ప్రజాదర్బార్ సందర్భంగా స్థానికులు పలు అంశాలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గణేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, సౌత్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ముజేబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటన

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పాత నగరం ఏరియా జలమయమైంది. ఈ విషయం తెలియడంతో 39వ వార్డులోని ఫెర్రీ రోడ్డు, చిలకపేట తదితర ప్రాంతాలలో ఎమ్మెల్యే గణేష్ కుమార్ పర్యటించారు. అధికంగా వర్షాలు కురుస్తున్న ప్రతిసారీ తమ ప్రాంతాలు నీటి ముంపునకు గురవుతున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరారు.

విశాఖ మార్కెట్లోకి టాటా మోటార్స్ నూతన వాహనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశపు అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ అయిన టాటా మోటార్స్ నుంచి సరికొత్త ఇంట్రా వి70, ఇంట్రా వి20 గోల్డ్, ఏస్ హెచ్ టులను విశాఖ మార్కెట్లోకి విడుదల చేస్తునట్టు టాటా మోటార్స్ విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ వాఘ్ తెలిపారు. మద్దిలపాలెంలోని టాటా మోటార్స్ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ కొత్త వాహనాలు మెరుగైన ఇంధన ఆదాతో ఎక్కువ దూరాలకు ఎక్కువ లోడ్లను మోసుకెళ్లేలా రూపొందించ బడ్డాయన్నారు. అత్యుత్తమ క్లాస్ ఫీచర్లను అందించడంతోపాటు ఈ వాహనాలు వివిధ రకాల వినియోగాల కోసం ఉపయోగపడతాయన్నారు. ఈ వాహనాల బుకింగ్లు అన్ని టాటా మోటార్స్ సీవీ డీలర్షిప్లలో మొదలయ్యాయని అన్నారు.

10న విజిల్ బ్లోయర్ సినిమా ఉచిత ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మానవ హక్కుల అంశంపై రూపొందించిన విజిల్ బ్లోయర్ సినిమాను ఈ నెల 10న సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయం హాలులో ఉచితంగా ప్రదర్శించనున్నారు. ఈ మేరకు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఓ ప్రకటన విడుదల చేశారు. మరిన్ని వివరాలకు 9032477463 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

ఓట్ల తొలగింపుపై సిబిఐకి ఫిర్యాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఓట్ల తొలగింపు వ్యవహారంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాత్రపై తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ సిబిఐకి మంగళవారం ఫిర్యాదు చేశారు. అక్రమ మార్గంలో మరోసారి అందలం ఎక్కేందుకు ప్రయత్నం చేస్తున్న జగన్మోహన్ రెడ్డిపై విచారణ జరిపించాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం 26 జిల్లాల ఎన్నికల అధికారులు ఎటువంటి సమాచారమూ లేకుండానే రాష్ట్ర మొత్తంగా 20 లక్షల మంది ప్రజల ఓటు హక్కును అక్రమంగా తొలగించారని ఆరోపించారు. దీనిలో వాలంటీర్ వ్యవస్థ అత్యంత కీలకంగా పని చేసిందన్నారు.

50 ఇళ్లకు ఒక వాలంటీర్చే నిఘా పెట్టి వారు ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నారనే విషయం తెలుసుకొని ఓటును తొలగించారన్నారు. గరుడ యాప్ ద్వారా ఓట్లు తొలగింపు అక్రమాలు కొనసాగాయన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అక్రమాలకు, అవినీతికి అంతే లేకుండా పోయిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయమని అన్నారు. ఎక్కడ చూసినా ప్రజలు ఇబ్బందులతో కనిపిస్తున్నారన్నారు. తన ఫిర్యాదుకు విశాఖలోని సిబిఐ ఎస్పి మురళీ రంబా సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంటు కమిటీ కార్యదర్శి బోడేపూడి దొరబాబు, డాక్టర్ పపూర్ నికుంజ్, తదితరులు పాల్గొన్నారు.

అరకులో టిడిపి విజయమే లక్ష్యం

ఆ పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి దొన్నుదొర



దొన్ను దొర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్/ హుకుంపేట: తెలుగుదేశం పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ రానున్న ఎన్నికల్లో అరకు నియోజకవర్గంలో టిడిపి గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానని అరకు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి, పార్టీ ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సివేరి దొన్నుదొర అన్నారు. తనకు ఇన్ఛార్జి బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడులకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, 2024 సార్వత్రిక ఎన్నికల్లో అరకు నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగరేయడమే లక్ష్యమన్నారు. అన్ని కులాలు, మతాలు, వర్గాలను కలుపుకుంటూ, పార్టీలోని అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని, అత్యధిక మెజార్టీ సాధించే దిశగా రేయింబవళ్లు శ్రమిస్తానన్నారు. కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీ తనకు అండగా నిలిచిందన్నారు. తెలుగుదేశం ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినందునే పార్టీ తనకు ఇపుడీ బాధ్యతలు అప్పగించిందని తాను నమ్ముతున్నట్లుగా తెలిపారు. గ్రామ గ్రామాన తిరిగి, అందరితో కలిసి పనిచేసి టిడిపి గెలుపును అధిష్టానానికి బహుమతిగా ఇస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాగా దొన్నుదొరను అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ఛార్జిగా నియమించడంతో హుకుంపేటలో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. కేకు కట్ చేశారు. మిఠాయిలు పంచారు.

దొన్నుదొరకు పదవిపై హర్షం

అనంతగిరి : అరకు నియోజకవర్గ అసెంబ్లీ ఇన్ఛార్జిగా సివేరి దొన్ను దొరకు బాధ్యతలు అప్పగించడంపై అనంతగిరి మండల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీ మండల అధ్యక్షులు టి.బుజ్జిబాబు బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు మాట్లాడుతూ టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి విశేషకృషి చేస్తున్న దొన్నుదొరకు టిడిపి సముచిత స్థానం కల్పించిందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ఛార్జిగా బాధ్యతలు అప్పగించిన అధిష్టానం, అరకు అసెంబ్లీ టిక్కెట్ ఖరారు చేస్తే పార్టీ శ్రేణులంతా సమిష్టిగా కృషి చేసి, గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంజరి, బుజ్జిబాబు. ఎస్.సుబ్బారావు, తిమోతి, సిహెచ్ రాజకుమార్, భీమన్న, వి.శంకరరావు పాల్గొన్నారు.

మాదిగల 'చలో విజయవాడ' వాయిదా

ప్రజాశక్తి - చింతపల్లి : మిచౌంగ్ తుఫాన్ కారణంగా మాదిగల చలోవిజయవాడ కార్యక్రమం వాయిదా పడిందని స్థానిక ఇన్నామ్ సభ్యుడు ఎం దొరబాబు, ఎంపిటిసి చిందాడ జయలక్ష్మి అన్నారు. మాదిగల న్యాయ మహాసభ పేరిట ఈనెల 7న చలో విజయవాడకు పిలుపునిచ్చినప్పటికీ, తుఫాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు గెడ్డం బాపిరాజు, ఇన్నామ్ అంతర్జాతీయ అధ్యక్షుడు మట్ట విద్యార్థి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు వేమగిరి ముసలిబాబు తెలియపరిచారన్నారు. ఈ విషయాన్ని మాదిగలంతా గమనించాలన్నారు.కార్యక్రమంలో వారితో పాటు స్థానిక మాదిగలు చిందాడ సత్యనారాయణ, అప్పారావు, ధారబాబు, వినోద్, పి నాగేశ్వరరావు, దానియేలు, వై రాజు పాల్గొన్నారు.

ఫొటో మార్ఫింగ్పై చర్యల్లో నిర్లక్ష్యం తగదు

విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : విదసం ఐక్యవేదిక నర్సీపట్నం జోన్ అడ్వైజర్ నేతల నాగేశ్వరరావు ఫొటోను పోలీస్ హెచ్చరిక చేసిన చెడ్డి గ్యాంగ్ దొంగల పోస్టర్లో మార్ఫింగ్ చేసి వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసిన వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగేశ్వరరావు ఫొటోను మార్ఫింగ్ చేసి చెడ్డి గ్యాంగ్ (దొంగల ముఠా) జాబితా ఫొటోల పోస్టర్లో అమర్చారన్నారు. ఒక దొంగ స్థానంలో నేతల నాగేశ్వరరావు ఫొటో మార్ఫింగ్ చేసి మన నర్సీపట్నం(ఓల్డ్ అండ్ ఒరిజినల్) వాట్సాప్ గ్రూపులో సభ్యులు సర్క్యులేట్ చేశారన్నారు సంఘటనపై అవమానం, మానసిక ఒత్తిడి, వేదనకు గురైన నాగేశ్వరరావు గత నెల 15న నర్సీపట్నం టౌన్ పోలీసులకు అనుమానితులు జాన్సన్, గ్రూప అడ్మిన్ శ్రావణ్లపై ఫిర్యాదు చేశారని, 18న కేసు నమోదు చేసినట్లు పోలీసులు రశీదు ఇచ్చారన్నారు. తర్వాత కేసులో పురోగతి లేకపోవడం శోచనీయమన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించి, నాగేశ్వరరావుకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కొత్తపాలెంలో తాగునీటి మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ శివారు కొత్తపాలెం గ్రామానికి తాగునీటిని అందించే మోటారు పాడవ్వడంతో సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. తుపాన్ సైతం లెక్కచేయకుండా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో హుటాహుటిన మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గెడ్డం ఆనంద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాల్సినెడ్ అల్యూమినా హ్యాండ్లింగ్లో రికార్డు

ప్రగతి పథాన విశాఖ పోర్టు ట్రస్టు



విశాఖ పోర్టు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ మరో రికార్డు నెలకొల్పింది. ఒకే నెలలో 7630 మెట్రిక్ టన్నుల కాల్సినెడ్ అల్యూమినాను హ్యాండిల్ చేయడం ద్వారా తన కీర్తి కిరీటంలో మరో కలికితురాయిని ఇముడ్చుకుంది. ఉత్కల్ అల్యూమినా ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఎంవిహెచ్సి నౌకలో సరుకును హ్యాండిల్ చేయడం ద్వారా ఈ రికార్డును నెలకొల్పింది. పోర్టు కొద్ది రోజుల క్రితమే 7549 మెట్రిక్ టన్నుల కాల్సినెడ్ అల్యూమినాను హ్యాండిల్ చేసిన విషయం తెలిసిందే. ఆ రికార్డును తాజాగా అధిగమించింది. ఎంవిహెచ్సి నౌకకు శ్రావణ్ షిప్పింగ్ సర్వీస్, ఈశ్వర్ షిప్పింగ్ సర్వీసులు స్టీమర్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ రికార్డును సాధించడంలో కృషి చేసిన స్టీమర్ ఏజెంట్లను, స్టీవ్డోర్స్ను పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. పోర్టు ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖర్రావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో పోర్టు మరింత ప్రగతి కనబరచాలని ఆకాంక్షించారు. పోర్టు సిబ్బంది మరింత కృషి చేయడం ద్వారా మంత్రిత్వ శాఖ విధించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. రికార్డును సాధించడంలో కృషి చేసిన ట్రాఫిక్ విభాగం సిబ్బందిని పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు.

దసపల్లా భూముల స్వాహాకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దసపల్లా భూములను కాజేయడానికి అధికార పార్టీ నాయకులు రంగం సిద్ధం చేశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. మంగళవారం మేఘాలయ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసపల్లా భూములు ప్రభుత్వానివా, ప్రైవేటువా అని ఆర్టిఐ ద్వారా అడిగినప్పుడు అవి ప్రభుత్వ భూములని, 22/ఎలో ఉన్నాయని గత నవంబర్లో తహశీల్దారు నోటీసులు విడుదల చేశారని గుర్తు చేశారు. గ్రౌండ్ రెంట్ పట్టాలుగా ఉన్న దసపల్లా భూములను ప్రైవేటు వ్యక్తులకు ఏ విధంగా కట్టబెట్టారని ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో ఉన్న దసపల్లా భూముల్లో మధ్యవర్తి దాట్ల సుబ్బరాజుకు 2700 గజాలలో భవన నిర్మాణానికి ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో ఉన్న 40 అడుగుల దసపల్లా రోడ్డులో 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును జివిఎంసి అధికారులు ప్రజాధనంతో వేస్తున్నారన్నారు. దసపల్లా భూములను ముఖ్యమంత్రి జగన్ వైసిపి నేతలకు ధారాదత్తం చేశారని సాక్ష్యాధారాలతో సహా గతంలోనే బయటపెట్టామని చెప్పారు. సర్క్యూట్ హౌస్ నుంచి నౌరోజీ రోడ్డుకు రహదారులు ఏర్పాటు చేస్తున్నారని, వైసిపి ఎంపీ కుటుంబం కోసం జివిఎంసి మాస్టర్ ప్లాన్ ఇచ్చారని ఆరోపించారు. ఆ భూములను కురుపాం రాజులు ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. ప్లాన్ పెండింగ్లో ఉండగా 84 ఫ్లాట్లకు నిబంధనలు తుంగలో తొక్కి జివిఎంసి పన్నులు ఏ విధంగా వేశారని ఆయన నిలదీశారు. వీటికి ప్లాన్ అప్రూవల్, ఆక్యుపేషన్ సర్టిఫికెట్లు లేవన్నారు. సమావేశంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్ఛార్జి పివిఎస్ఎన్.రాజు, పసుపులేటి ఉషాకిరణ్, రేవతి పాల్గొన్నారు.

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

విశాఖ కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్డిఒలు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, బిఎల్ఒలు, ఎంపిడిఒలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారితో పాటు 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండబోయే వారిని కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అందుకోసం ఆయా కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రానున్న మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఓటరు నమోదు పట్ల ఆయా కళాశాలల్లో నిర్వహించే తరగతుల్లో అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓటరు నమోదు ఫిజికల్గానూ, ఆన్లైన్ ద్వారానూ నమోదు చేసుకోవచ్చుని, ఫిజికల్గా నమోదు చేసుకోలేని వారు ఓటర్ హెల్ప్లైన్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- దుంబ్రిగుడ : మండలంలోని అరుకు సంతబయలులోని ఓ కిరాణా దుకాణం బయట ఒక వ్యక్తి విగత జీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు.. దుకాణదారుడు సోమవారం రాత్రి దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం దుకాణం తెరవడం కోసం వచ్చేసరికి, అక్కడ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా రీతిలో మృతి చెంది ఉండడాన్ని గమనించి స్థానికులకు తెలియపరిచారు. వారు పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తి మతదేహాన్ని పంచాయతీ సిబ్బంది పక్కకు తొలగించారు. ఈ విషయంపై పోలీసులకు పంచాయతీ సిబ్బంది సమాచారం అందించారు. ఎస్ఐ సంతోష్కుమార్ చేరుకుని వెంటవెంటనే ఆరా తీశారు. మృతుడు ఒడిశా రాష్ట్రం పాడువకు చెందిన వ్యక్తిగా గుర్తించి అతని బంధువులకు సమాచారమిచ్చి మృతదేహాన్ని అప్పగించారు.

పాడేరు ఘాట్ రోడ్డులో ప్రమాదం - యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఘాట్లో ఘాట్లో బైక్ పై ప్రయాణిస్తున్న ఓ యువకుడు అనూహ్య ప్రమాదానికి గురై మంగళవారం సాయంత్రం దుర్మరణం చెందాడు. వీ.మాడుగుల మండలం వీరనారాయణం గ్రామానికి చెందిన సరగడం శ్రీధర్ (24), ఇదే గ్రామానికి చెందిన ఆదిబాబు అనే మరో వ్యక్తి పాడేరు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా రాజాపురం సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. ఆదిబాబు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బైక్ ప్రమాదానికి గల కారణాలు తెలియ రాలేదు. తుఫాన్ కారణంగా ఘాట్లో వర్షం తీవ్రత అధికంగా ఉంది. శ్రీధర్ మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

160 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో రత్నంపేట గ్రామ శివారులో నిర్వహించిన దాడుల్లో ఏడు సంచులతో 160కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలివి. పక్కాగా అందిన సమాచారం మేరకుసిబ్బందితో దాడి చేయగా ఏడు గోనె సంచులతో ఒక వ్యక్తి అనుమానాస్పదగా సంచరిస్తూ, పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నంలో పట్టుబడ్డాడు. మూటలను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. మధ్యవర్తుల సమక్షంలో 160 కిలోల గంజాయిని, రెండు సెల్ఫోన్లను స్వాధీసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తహశీల్దార్లతో ఎమ్మెల్యే ధర్మశ్రీ టెలీ కాన్ఫరెన్స్

రావికమతం : మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నియోజకవర్గంలోని నాలుగు మండలాల తాసిల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, పరిస్థితిపై సమీక్షించారు.మండలాల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకుని, ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలలో వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల వారీగా పంటలు, ఇతర నష్టాలపై ఆరా తీశారు. అలాగే సర్పంచులు, ఎంపిటిసిలతో మాట్లాడి, గ్రామాల వారీగా తుపాన్ ప్రభావం, నష్టాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మేజర్ సమస్యలను తన దృష్టికి తేవాలని కోరారు.

అనకాపల్లిలో నేలకొరిగిన 11 వేల ఎకరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, యలమంచిలి రూరల్, అనకాపల్లి, మునగపాక, గొలుగొండ విలేకరులు

తుపాను ప్రభావంతో జిల్లా అంతటా భారీగా వర్షాలు పడ్డాయి. గాలులకు అనేక ప్రాంతాల్లో వరిపంట నేలకొరిగింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో ఒరిగిన వరిచేను తడిసిపోయింది. ఒకటి, రెండు రోజుల్లో కోయాల్సిన వరి పంట భారీ వర్షాలకు కళ్లముందు నేల కొరగడంతో అన్నదాత కన్నీటి పర్యమంతమవుతున్నాడు. జిల్లాలో సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షాలతో 85.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం 5.4 మిల్లీమీటర్లు నమోదుకాగా, మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు 28.1 మిల్లీమీటర్లు, ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 52.3 మిల్లీమీటర్లు కురిసింది. వ్యవసాయశాఖాధికారుల అంచనా ప్రకారం మండలాల్లో దాదాపు 11 వేల ఎకరాల వరి నేలకొరిగి, తడిసింది. అనధికారికంగా ఆయా ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు దాదాపు 25 వేల ఎకరాలకుపైగా వరిపంట గాలులకు నేలకొరిగి తడిసింది. బుధవారం కూడా గాలులతో కూడిన భారీ వర్షాలు కొనసాగితే వరి పంట నష్టం తీవ్రంగా వుంటుంది. తడిసిన వరిచేను ధాన్యం రకం మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగిన వరిపంటపై నీరు పారితే కోయడానికి కూడా పనికిరాదని చెబుతున్నారు.

జిల్లాలోని జలాశయాలు, నదీపరివాహక ప్రాంతాల్లోని నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, చీడికాడ, నక్కపల్లి, పాయకరావుపేట, మాడుగుల, కోటవురట్ల, యలమంచిలి మండలాల్లో ఎక్కువ పంట నష్టం వాటిల్లింది. రెండ్రోజుల పాటు కురిసిన వర్షాలకు అత్యధికంగా కోటవురట్ల మండలంలో 146.4 మిల్లీమీటర్లు నమోదుకాగా, అత్యల్పంగా పాయకరావుపేట మండలంలో 32.7 మిల్లీమీటర్లు నమోదైంది. కోటవురట్ల, నర్సీపట్నం, మాకవరపాలెం, నక్కపల్లి, కశింకోట, అచ్యుతాపురం, రోలుగుంట, కె.కోటపాడు, సబ్బవరం మండలాల్లో 91.8 నుంచి 146.4 మిల్లీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. 70.6 నుంచి 89.3 మిల్లీమీటర్ల మధ్యలో ఎస్.రాయవరం, గొలుగొండ, యలమంచిలి, పరవాడ, అనకాపల్లి, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, మునగపాక మండలాల్లో వర్షం కురిసింది. రాంబిల్లి, మాడుగుల, చీడికాడ, నాతవరం, దేవరాపల్లి, పాయకరావుపేట మండలాల్లో 32.7 నుంచి 69.4 మిల్లీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాళ్లపాలెం వద్ద నీరు నిల్వవుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మునగపాకలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జలమయమైంది. అనకాపల్లి ఆవఖండంలో వరి పొలాల్లో నీరు నిల్వవుంది. యలమంచిలి మండలం తెరువుపల్లిలో వరి పొలాలు గాలులకు నేలకొరిగాయి. యలమంచిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లోకి మురుగునీరు చేరింది. కాలువలు పారకపోవడంతో నీరంతా రోడ్డుపైకి చేరింది. గొలుగొండ మండలం అమ్మపేటలో కోతకోసిన వరి వర్షాలకు తడిచిపోయింది. కల్లాలకు పంట చేరకముందే పంటంతా తడిసింది. పెట్టిన పెట్టుబడులు కూడా రావని అమ్మపేటకు చెందిన గొల్లు సత్యనారాయణ వాపోయాడు. ప్రభుత్వం పంట నష్టం పరిహారం చెల్లించకపోతే అప్పులపాలవుతామని అన్నాడు.

నేటి జివిఎంసి సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి జరగాల్సిన జివిఎంసి సర్వసభ్య సమావేశాన్ని బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను కారణంగా వాయిదా వేసినట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను కారణంగా ఉత్పన్నమైన ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా నగర ప్రజలకు అందిస్తున్న సేవలలో, సహాయక చర్యలలో ప్రజాప్రతినిధులు, వార్డు కార్పొరేటర్లు, జివిఎంసి యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్ల అభ్యర్థన మేరకు, జివిఎంసి కమిషనర్ సిఫార్సు మేరకు సమావేశాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

కెకె లైన్లో రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొత్తవలస-కిరండూల్ లైన్లోని త్యాడ-శివలింగపురం సెక్షన్లో ట్రాక్పై బండరాయి పడిపోవడంతో ఆ మార్గంలో రైళ్లు రద్దయ్యాయని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ క్రమంలో 18514 విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్ప్రెస్ డిసెంబర్ 5న, 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్ప్రెస్ డిసెంబర్ 6న, 08552 కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్ డిసెంబర్ 7న రద్దయ్యాయి. అంతేకాకుండా 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్ప్రెస్ డిసెంబర్ 5న కోరాపుట్-రాయగడ-విజయనగరం-కొత్తవలస మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడవనున్నట్టు అధికారులు తెలిపారు.